ప్రకాశం జిల్లా తేది:20.02.2025

**గ్రూప్ - 2 మెయిన్స్ పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి: ప్రకాశం జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా IAS గారు**

**గ్రూప్-2 మెయిన్ వ్రాత పరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు: ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ ఏఆర్ దామోదర్ ఐ.పి.యస్ గారు.**

**పరీక్ష నియమ నిబంధల ఉల్లంఘనకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు: జిల్లా ఎస్పీ గారు**

గ్రూప్ - 2, ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా IAS గారు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఫీజులు, హాల్ టికెట్ల పరంగా యాజమాన్యాలు ఎక్కడైనా ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లా ఎస్పీ శ్రీ. ఏ.ఆర్ దామోదర్, జాయింట్ కలెక్టర్ శ్రీ ఆర్. గోపాలకృష్ణతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు.

సకాలంలో చేరుకోవాలి...

APPSC నిర్వహించే గ్రూప్ – 2 మెయిన్స్ పరీక్షలు జిల్లాలోని 7 సెంటర్లలో ఈ నెల 23 వ తేదీన జరుగనున్నాయన్నారు. ఉదయం మరియు మధ్యాహ్నం సమయాలలో జరిగే ఈ పరీక్షలలో 4,544 మంది అభ్యర్థులు హాజరు కాబోతున్నారని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేసారన్నారు. ఒంగోలు మరియు నగర శివారులోని క్విస్ కాలేజీ, నాగార్జున డిగ్రీ కాలేజీ, శ్రీహర్షిని డిగ్రీ, పీజీ కాలేజీ, రైస్ కాలేజీ, పేస్ కాలేజీలలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, ఇందుకోసం 8:30 నుంచి 9:30 వరకు అభ్యర్థులను అనుమతిస్తామన్నారు. మధ్యాహ్నం పరీక్ష మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందని, ఇందుకోసం మధ్యాహ్నం 1:30 నుంచి 2:30 గంటల వరకు అభ్యర్థులు అనుమతిస్తామని కలెక్టర్ చెప్పారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ పరీక్షలకు 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుందన్నారు. పరీక్ష నిడివి రెండున్నర గంటలు అని చెప్పారు.

జిల్లాలో ఈ పరీక్షలు సజావుగా జరిగేలా పర్యవేక్షించేందుకు జాయింట్ కలెక్టర్ శ్రీ.ఆర్.గోపాలకృష్ణ కోఆర్డినేటింగ్ ఆఫీసరుగా ఉంటారని, మరో ఏడుగురు జిల్లాస్థాయి అధికారులను లైజనింగ్ ఆఫీసర్లుగా నియమించామని కలెక్టర్ తెలిపారు. మొబైల్ ఫోన్లు , స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వేటినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ఆయా పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. దివ్యాంగులు, గర్భిణులు గ్రౌండ్ ఫ్లోర్ లోనే పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభ్యర్థులందరూ హాల్ టికెట్ తో పాటు ఏదైనా ఒక ఫోటో గుర్తింపు కార్డును తీసుకురావాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రంలో, పరీక్ష రాసే సమయంలో అనుచితంగా ప్రవర్తిస్తే సదరు అభ్యర్థులను డీబార్ చేస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేసి న్యాయపరమైన చర్యలు కూడా తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏమైనా సందేహాలు వుంటే నివృత్తి చేయడం కోసం కలెక్టరేట్ లో 8801188046 నెంబరుతో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు.

ఇంటర్ పరీక్షలకు 42,439 మంది....

మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కోసం జిల్లాలో 67 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు.
ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు 21624 మంది ప్రథమ, 20815 మంది ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్ లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. హాల్ టికెట్లతో ఉదయం 8:30 గంటలలోపే పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత వచ్చే విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు 3 సిట్టింగ్ స్క్వాడ్స్, మరో 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలు సీసీటీవీల నిఘాలో జరుగుతాయన్నారు. రాష్ట్ర కార్యాలయం నుంచి ఇద్దరు పరిశీలకులను కూడా నిర్మించినట్లు కలెక్టర్ చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం 24 గంటలూ పనిచేసేలా జిల్లా స్థాయిలో 08592-281275 నెంబరుతో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లను ముందుగానే జారీ చేయాలని కళాశాలల యాజమాన్యాలకు కలెక్టర్ స్పష్టం చేశారు. హాల్ టికెట్లు జారీ చేసేటప్పుడు కాలేజీ / హాస్టల్ బకాయిలు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తే సహించబోమని ఆమె హెచ్చరించారు. హాల్ టికెట్లను 9552300009 నంబరుకు వాట్సప్ లో హాయ్ అని మెసేజ్ చేయటం ద్వారానూ ఉచితముగా డౌన్లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

183 కేంద్రాలలో టెన్త్ పరీక్షలు...

మార్చి 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం జిల్లాలో 183 సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 29,602 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయబోతున్నట్లు చెప్పారు. వీరిలో బాలురు 14,994 మంది, బాలికలు 14,608 మంది ఉన్నట్లు వివరించారు. విద్యార్థులలో 28176
మంది ఇంగ్లీష్ మీడియం, 1423 మంది తెలుగు మీడియం, మరో ముగ్గురు ఉర్దూ మీడియం వారు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 గం. నుంచి మధ్యాహ్నం 12.45గం. వరకు జరుగుతాయని అన్నారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేవిధం గా ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో మార్చి 17 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు 1,564 మంది, మార్చి 3 నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలకు 4,175 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఎలాంటి పుకార్లను వ్యాప్తి చేసినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

పటిష్ట భద్రత : ఎస్పీ గారు

ఎస్పీ గారు మాట్లాడుతూ జిల్లాలోని గ్రూప్-2 మెయిన్స్ వ్రాత పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా కేంద్రమునకు 200 మీటర్ల దూరం వరకు నిషిద్ధ ప్రదేశంగా భావించి 144 సెక్షన్ అమలులో ఉందని, ఈ పరీక్ష ముగిశాక ఆ పత్రాలు స్ట్రాంగు రూంలకు వెళ్లేంత వరకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవటం జరిగిందని, పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నామని తెలిపారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ లో పోలీస్ హెల్ప్ డెస్క్ లను కూడా ఏర్పాటు చేయటం జరుగుతుందని, అభ్యర్థుల కొరకు అత్యవసర సమయంలో

ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు పరీక్షల సమయంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని, ప్రశాంతంగా మరియు సజావుగా పరీక్షలు నిర్వహించేలా పోలీస్ శాఖ తరఫునుండి అన్ని చర్యలు తీసుకున్నామని తెలియచేసినారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు ఉన్నట్లు తెలిస్తే వెంటనే అదుపులోకి తీసుకొని విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద డ్రోన్ ద్వారా కూడా భద్రతను పర్యవేక్షిస్తామని ఎస్పీ  తెలిపారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్స్ లో సూచించిన నియమ, నిబంధనలు కుణ్ణంగా చదువుకొని, వాటిని పాటించాలన్నారు. సోషల్ మీడియాలో మెయిన్స్  పరీక్ష గురించి నిజానిజాలు తెలుసుకోకుండా  తప్పు దారి పట్టించే ఫేక్ న్యూస్ పెట్టినా, షేర్ చేసే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగినా వెంటనే *DIAL 100/112* లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ *9121102266* కు సమాచారం అందించాలని ఎస్పీ తెలియచేసారు.

ఈ సమావేసంలో డి.ఆర్.వో. శ్రీ. బి. చిన  ఓబులేసు, ఆర్.ఐ.ఓ. సైమన్ విక్టర్, డి.ఈ.ఓ. కిరణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




